క్లుప్తంగా

నాడు నేడు పనులపై పర్యవేక్షణ పెంచండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈ ఏడుకొండలు

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలలో మనబడి నాడు నేడు రెండవ విడతలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు, భవన నిర్మాణాలపై హెచ్ఎంలు, గ్రామ సచివాలయాల ఇంజినీర్ అసిస్టెంట్లు పర్యవేక్షణ పెంచాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఏడుకొండలు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం హెచ్ఎంలు, ఇంజినీర్ అసిస్టెంట్లతో ఏఈ గోనేనాయక్, ఎంఈఓ జ్యోతితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెండవ విడత నాడునేడులో భాగంగా జరుగుతున్న పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయించాలన్నారు. హెచ్ఎంలు, పీఎంసీ సభ్యులతో ఇంజినీర్ అసిస్టెంట్లు రెగ్యులర్‌గా సమీక్షించుకోవాలని, అలాగే నాణ్యతగా పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

జాతీయ ఉద్యాన శాఖ బోర్డు డైరెక్టర్‌గా సోమశేఖర్‌రెడ్డి



కల్లూరు: జాతీయ ఉద్యాన శాఖ బోర్డు డైరెక్టర్‌గా కల్లూరు మండల బీజేపీ మండల అధ్యక్షుడు సింగం సోమశేఖర్‌రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. జాతీయ ఉద్యాన శాఖ బోర్డు డైరెక్టర్ నామినేటెడ్ పదవి కాలం మూడు సంవత్సరాలుగా ఉంటుందని, బాధ్యతయుతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా సోమశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

జగనన్న భూ హక్కు పత్రాల పంపిణీ



రైతులకు జగనన్న భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న వీఆర్వో శ్రీనివాసులు

సి.బెళగల్: మండల పరిధిలోని పలుకుదొడ్డి రెవెన్యూ గ్రామంలో బుధవారం వీఆర్వో శ్రీనివాసులు రెండవ విడత కింద మంజూరైన శాశ్వత భూ హక్కు పత్రాలను రైతులకు పంపిణీ చేశారు. పలుకుదొడ్డి గ్రామ రెవెన్యూ పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామానికి 160 మంది రైతులకు, సంగాల గ్రామంలో 54 మందికి, పలుకుదొడ్డి గ్రామంలో 74 మంది రైతులకు కొత్తగా మంజూరైన శాశ్వత భూ హక్కు పత్రాలు అందజేశారు.

'సుంకేసుల'కు 7,170 క్యూసెక్కుల ఇన్ ఫ్లో



సుంకేసుల జలాశయం

గూడూరు: సుంకేసుల జలాశయానికి బుధవారం 7,170 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. ఎగువ ప్రాంతాలలో కురిసిన వానలకు ఇన్ ఫ్లో ఉన్నట్లు డ్యామ్ అధికారులు తెలిపారు. దీంతో ఒక గేట్‌ను మీటరు మేర ఎత్తి దిగువకు 4,446 క్యూ సెక్కుల నీటిని విడుదల చేశారు. కేసీ కాల్వకు 1,616 క్యూ సెక్కుల నీటిని విడుదల చేసినట్లు వారు పేర్కొన్నారు. డ్యామ్‌లో 1.194 టీఎంసీల నిల్వ ఉంది.

విద్యా సామర్థ్యాలను పెంపొందించండి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ

సి.బెళగల్: విద్యార్థులలో విద్యా సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈఓ జ్యోతి అన్నారు. బుధవారం ఆమె సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని సందర్శించి శిక్షణ తరగతులను తనిఖీ చేశారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో భాగంగా తెలుగు, హిందీ పాఠ్యాంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు భాషాంశాలపై పూర్తి అవగాహన కల్పించేలా తరగతులను బోధించాలని సూచించారు.

దేశ నాయకులను మరువరాదు

పాణ్యం: దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల నాయకుల త్యాగాలను మరువరాదని పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం మేరీ సునీతా అన్నారు. బుధవారం అజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 25నుంచి 28 వరకు ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.

కుక్క కాటు.. నిర్లక్ష్యం చేటు!

- మూడేళ్లలో 13,286 మందికి కుక్కకాటు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా కుక్క కాటు మందు
- పీహెచ్‌సీల్లోనూ ఏఆర్‌వీ మందు
- అప్రమత్తతే అవసరమంటున్న వైద్యులు
- నేడు రేబీస్ వ్యాధి నివారణ దినం





కుక్కకాటుకు గురైన చిన్నారులకు ఏఆర్‌వీ ఇంజెక్షన్లు వేస్తున్న వైద్యసిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): అది మన మధ్యన తిరిగే సాదారణ జంతువే. మనతో ఎంతో విశ్వాసం చూపించే జీవి. అయితే దానికీ తిక్కుంది...దానికో లెక్కుంది అన్నట్లుగా అది కూడా అప్పుడప్పుడు మనిషి కరుస్తుంది. అది కరిస్తే మాత్రం నాలుగు వారాల పాటు ఆసుపత్రికి వెళ్లి సూదులేయించుకోక తప్పదు. లేకపోతే మనిషి కూడా కుక్కలాగా అరుస్తూ క్రమంగా మరణానికి దగ్గరవుతాడు. దీనినే రేబిస్ అంటారు. ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు గాను ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 28న రేబిస్ వ్యాధి నివారణ దినంగా నిర్వహిస్తున్నారు.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ఎమ్మిగనూరు, ఆదోని ఏరియా ఆసుపత్రులు, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 35 పీహెచ్‌సీలు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు, 426 సచివాలయాలు ఉన్నాయి. సచివాలయాలు మినహా ప్రతి పీహెచ్‌సీలో జనాభాను బట్టి 50 నుంచి 80 దాకా, సీహెచ్‌సీలో 200 దాకా, ఏరియా ఆసుపత్రుల్లో 500 దాకా, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వెయ్యి దాకా ఏఆర్‌వీ ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రస్తుతం కర్నూలు నగరంలో ఉన్న సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లోనూ 2 వేల ఏఆర్‌వీ వాయిల్స్ అందుబాటులో ఉన్నాయి. కుక్క కాటు మందుకు కొరత లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కుక్కలను పట్టుకెళ్లి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నిర్వహించి తిరిగి వాటిని వదిలేస్తున్నారు. జిల్లాలో ఎక్కువగా కుక్క కాటు బాధితులు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వస్తున్నారు. ప్రతి నెలా 500లకు పైగా కొత్త కేసులు, వెయ్యికి పైగా పాత కేసులకు ఏఆర్‌వీ ఇంజెక్షన్లు వేస్తున్నారు. ఈ యేడాది ఇప్పటి వరకు 3,830 కొత్త వారికి, 8,849 మంది పాత వారికి ఏఆర్‌టీ(కుక్క కాటు మందు)ను వేశారు.

రేబిస్ వ్యాధి ప్రాణాంతకం

కుక్క కరిచిన తర్వాత శరీరంలో రేబిస్ వ్యాధికారక క్రిములు చేరాక వ్యాధి బయటపడే వ్యవధి నాలుగు నుంచి ఐదు రోజులు పడుతుంది. అయితే కుక్క ఎక్కడ కరిచింది, ఎంతో లోతు గాయమైంది, ఏ ప్రాంతంలో కరిచింది, దుస్తులపై కరిచిందా, నేరుగా కరిచినప్పుడు ఎంత మేరకు వైరస్ శరీరంలోకి ప్రవేశించిందన్న దానిపై వ్యాధి తీవ్రత ఆధారపడి ఉంటుంది. కుక్కకాటు తర్వాత వైరస్ శరీరంలోని కండరాల్లోకి వెళ్లి అక్కడ అభివృద్ధి చెంది నరాల్లోకి ప్రవేశిస్తుంది. ఆ తర్వాత నరాల్లో నుంచి మెదడుకు వెళ్తుంది. అక్కడ నుంచి కణాల సముదాయంలోకి, కండరాల్లోకి, ఎముకలు, గ్రంథుల్లోకి వెళ్లి లాలాజలంలో ప్రవేశిస్తుంది. స్కిన్ బయాప్సీ, లాలాజలం ద్వారా ఈ వైరస్‌ను నిర్ధారిస్తారు.

రేబిస్ వ్యాధి నిర్ధారణ

ఈ వ్యాధికి స్పష్టమైన చికిత్స లేదని వైద్యులు చెబుతున్నారు. అయితే కుక్కకాటుకు గురైన సందర్భాల్లో వైద్యులు ఇచ్చే వ్యాక్సిన్ వల్ల రేబిస్ రాకుండా కాపాడుకోవచ్చు. కుక్కకాటు తర్వాత పదిరోజుల పాటు ఎలాంటి లక్షణాలు కనిపించకపోతే ఆందోళన చెందాల్సిన పనిలేదు. కరిచిన పదిరోజుల్లోగా కుక్క చనిపోతే దానికి వైరస్ ఉందని భావించాలి. ఇలాంటి కుక్కలు మనిషికి ఉన్న పుండ్లు, గాయం ఉన్న చోట నాకినా, కొరికినా రేబిస్ వచ్చే ప్రమాదం ఎక్కువ.

రేబిస్ వ్యాధి లక్షణాలు

కుక్క కరిచిన ప్రాంతంలో నొప్పితో పాటు తల, ఒళ్లు, గొంతు నొప్పి, సాధారణ జ్వరం ఉంటాయి. ఈ లక్షణాల తర్వాత వైరస్ మెదడును తీవ్రమైన ఉద్వేగాలకు లోనయ్యేలా చేస్తుంది. దీంతో గాలికి భయపడతారు. దీనిని ఏరో ఫోబియో అంటారు. నీళ్లను చూసినా వణికిపోతారు. ఈ కండీషన్‌ను హైడ్రోఫోబియా అంటారు. గొంతులోని కండరాలు బిగుసుకుపోతాయి. ఈ పరిస్థితుల్లో రోగిని ఆసుపత్రిలో చేర్చాలి. లక్షణాలను బట్టి వైద్యులు చికిత్స అందిస్తారు.

కుక్కకాటు బాధితులు

సంవత్సరం	కుక్కకాటు బాధితులు
2021	3,533
2022	5,333
2023	4,411

కుక్కకరిస్తే ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- కుక్కకాటుకు గురైన వారు తప్పనిసరిగా యాంటి రేబిస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ) వేయించుకోవాలి.
- వీరికి మొదటి, మూడవ, ఏడవ, 14వ, 30వ రోజుల్లో వ్యాక్సిన్ వేస్తారు. కుక్క గాటుకు గురైందన్న అనుమానం ఉన్న వారికి మొదటి, మూడవ రోజున వ్యాక్సిన్ వేస్తారు.
- కుక్కే కాదు పంది, పందికొక్కులు, కోతులు, గాడిదలు, గుర్రాలు, గబ్బిలాలు, ఎలుకలు, పిల్లులు వంటి జంతువులు కరిచినా ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయించుకోవాలి.
- గాయం పెద్దగా ఉంటే ఏఆర్‌వీతో పాటు ఖరీదైన ఇమ్యునోగ్లోబిలిన్స్ ఇంజెక్షన్ కూడా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బాధితులకు ఉచితంగా ఇస్తున్నారు.
- కుక్క కరిచిన వెంటనే గాయాన్ని శుభ్రంగా కడగాలి. అనంతరం వైద్యుని వద్దకు వచ్చి చికిత్స తీసుకోవాలి. అతి పెద్ద గాయాలైతేనే కట్టుకట్టాలి. చిన్న గాయాలను కట్టుకట్టకుండా వదిలేయాలి.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వ్యాక్సిన్ ఉచితం



కుక్క కాటుకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏఆర్‌వీ వ్యాక్సిన్‌ను సిద్ధంగా ఉంచాం. అక్కడి జనాభాను బట్టి ప్రతి పీహెచ్‌సీలో 50 నుంచి 80, యూపీహెచ్‌సీల్లో 40 దాకా వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయి. ఎవ్వరికైనా అవసరమైతే జిల్లా కేంద్రానికి వచ్చి తీసుకెళ్లి నిల్వ చేసుకునే సౌకర్యం కల్పించాం. ఎక్కడా వ్యాక్సిన్‌కు డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం ఉచితంగా ఖరీదైన ఏఆర్‌వీ ఇంజెక్షన్లు ప్రజలకు అందుబాటులో ఉంచింది. ప్రజలు సైతం కుక్కకాటు పట్ల నిర్లక్ష్యంగా ఉండకుండా అవి కరిచిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వ్యాక్సిన్ వేయించుకోవాలి.
–డాక్టర్ బి.రామగిడ్డయ్య,డీఎంహెచ్ఓ, కర్నూలు

కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలి



కుక్కకాటును ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదు. ఇందులో మూడు కేటగిరిలు ఉన్నాయి. కుక్క లాలాజలం తాకినా, అది మూతి తాకించినా మొదటి కేటగిరి, మనిషి పై చర్మాన్ని పట్టుకుంటే రెండో కేటగిరి. ఈ రెండింటికీ ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేస్తాం. మనిషిని రక్తం వచ్చేలా కరవడం మూడో కేటగిరి కిందకు వస్తుంది. దీనికి ఇమ్యునోగ్లోబిన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. కుక్క కరిచినా ఏమీ కాదులే అని కొందరు రెండు, మూడు రోజులు ఆలస్యంగా వస్తారు. అలాంటి వారికి మొదటి రోజు డబుల్ డోస్ వ్యాక్సిన్ ఇస్తాం. పెంపుడు కుక్కలు ఉన్నవారు కుటుంబ సభ్యులందరూ వ్యాక్సిన్ వేయించుకోవాలి. కుక్కకూ వ్యాక్సిన్ వేయించాలి.
– డాక్టర్ సయ్యద్ ఇమ్రాన్ ఖాద్రి, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

30లోపు ఈ- కేవైసీ చేయించుకోండి



పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: సాగు చేసిన పంటలను ఈ పంటలో తప్పకుండ నమోదు చేయించుకోవాలని, తప్పకుండా ఈనెల 30లోపు ఈ- కేవైసీని చేయించుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. మండలంలోని సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పోలకల్ గ్రామాలలో జరుగుతున్న పంటల నమోదును ఏఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

40 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు

ప్రభుత్వం సబ్సిడీపై పప్పు శనగ విత్తనాలను 40 శాతం సబ్సిడీపై అందజేస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. మండలానికి మొదటి విడతగా జేజీ - 11 రకానికి చెందిన 260 క్వింటాళ్ల పప్పు శనగ విత్తనాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. క్వింటాం పూర్తి ధర రూ.8,100 ఉండగా, సబ్సిడీ రూ.3,240 (40 శాతం) పోను రైతులు రూ. 4,860 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సిద్ధు, వీఏఏలు హిమబింధు, రైతులు పాల్గొన్నారు.

వింత జీవాలు జననం

ఓర్వకల్లు: మండలంలోని పూడిచెర్ల గ్రామంలో రెండు వింత జీవాలు జన్మించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బోయ సుబ్బరాయుడికి 200 జీవాలు ఉన్నాయి. గత 40 ఏళ్ల నుంచి ఇతను జీవాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. అయితే బుధవారం ఓ మేక మూడు జీవాలకు జన్మనిచ్చింది. అందులో ముందుగా సాధారణంగా ఒక జీవం జన్మించగా, రెండో సారి ప్రసవంలో ఆడ, మగ జీవాలు కలిసి జన్మించాయి. అయితే ఒకే తల, రెండు మొండాలు అతుక్కొని, నాలుగు చెవులు, ఎనిమిది కాళ్లు కలిగిన వింత జీవం జన్మించింది. అయితే కొద్దిసేపటికి మృతి చెందింది. దీంతో గత 40 ఏళ్ల నుంచి ఇలాంటి దృశ్యం ఎప్పుడూ చూడలేదని జీవాల యజమాని సుబ్బరాయుడు వాపోతున్నాడు. ఈ విషయంపై పశు వైద్యులను ఆరాతీయగా జన్యుపరమైన లోపం వచ్చినపుడు గర్భంలో అసహజమైన మార్పులు సంభవించి వింత అవయవాలతో కూడిన సంతతికి జన్మనిస్తాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



గుడిపాడులో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

గూడూరు రూరల్: ప్రభుత్వం పేదల ఆరోగ్యం కొరకు చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి రేష్మ సూచించారు. గుడిపాడులో బుదవారం వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి చేపట్టిన వైద్య పరీక్షల సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వచ్చే వైద్య సిబ్బందికి ప్రజలు సహకరించి బీపీ, షుగర్, తదితర పరీక్షలను చేయించుకోవాలన్నారు.

పంచలింగాలలో పరిసరాలు పరిశుభ్రం

సాక్షి ఎఫెక్ట్



నేడు పంచలింగాలలో చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ చల్లిన దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలో పరిసరాలు పరిశుభ్రమయ్యాయి. ఈ నెల 26వ తేదీన 'సాక్షి' దినపత్రికలో 'పడకేసిన పారిశుద్ధ్యం' అనే కథనం ప్రచురితమైంది. ఇందుకు కర్నూలు మండల ఉన్నతాధికారులు స్పందించి కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయించారు. అంటు రోగాలు ప్రభలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. సకాలంలో ఉన్నతాధికారులు స్పందించడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షిప్తం

సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

గడివేముల: ప్రజలకు అన్ని సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని గడిగరేవుల సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో గడపగడపకు మనప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా వచ్చిన వినతులలో భాగంగా డ్రైనేజీ నిర్మాణానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి నిధులు మంజూరు చేయించారు. దీంతో బుధవారం రూ. 12 లక్షలతో డ్రైనేజీని ఏర్పాటు చేసేందుకు భూమి పూజ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన వినతులను పరిష్కరించడంతో ప్రజలు సంతోషంగా వ్యక్తం చేస్తున్నరన్నారు. గ్రామాన్ని మరింత అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోదా ప్రసాద్,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కల్లూరు: మండలంలో శనగ విత్తనాలు కావాల్సిన రైతులు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లోని వీఏఏ/వీహెచ్ఏలను కలసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం ఆయన లక్ష్మీపురం, బస్తిపాడు గ్రామాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మండలానికి 3,620 క్వింటాళ్ల పప్పు శనగ కేటాయించిందన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కల్లూరు : ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉలిందకొండ గ్రామానికి చెందిన చాకలి రంగయ్య (53) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఎస్‌ఐ నల్లప్ప తెలిపిన వివరాలు... ఉలిందకొండ గ్రామానికి చెందిన చాకలి రంగయ్య ఈనెల 23వ తేదీన పురుగు మందు పొలానికి పిచకారీ చేశారు. మిగిలిన పురుగు మందు ప్లాస్టిక్ బిండెలో ఉండగా నీరు అనుకొని తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. మృతుని కుమారుడు చాకలి గోవిందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేడీసీసీ బ్యాంక్‌లో వ్యక్తిగత రుణాలు

పాణ్యం: కేడీసీసీ బ్యాంక్‌లో వ్యక్తిగత రునాలు అందిస్తున్నామని డీజీఎం ఉమామహేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం పాణ్యంలోని బ్యాంక్, బస్టాండ్‌లో ఉన్న పాతబడిన సొసైటీ గోడౌన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేడీసీసీ బ్యాంక్‌లో బంగారు రుణాలకు గ్రామ్‌కు రూ.4500 అందిస్తున్నామన్నారు. అలాగే వాహనాలకు రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. పాణ్యం బస్టాండ్‌లో పాతబడిన సొసైటి గోడౌన్‌ను తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ రవికుమార్, కంబాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టెంకాయల వేలం పాట వాయిదా

గూడూరు రూరల్: కె.నాగలాపురంలోని గ్రామ దేవత శ్రీ సుంకులాపరమేశ్వరీదేవి దేవస్థానము పాలక మండలి ఆధ్వర్యంలో గురువారం చేపట్టాల్సిన టెంకాయల వేలం పాటను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు బుధవారం ఈఓ రాధాకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనివార్య కారణాల మూలంగా టెంకాలయ వేలం పాటను జరుపలేకపోతున్నామని, ఉన్నతాధికారులు, పాలక మండలి సభ్యుల నిర్ణయం మేరకు తొందరలోనే వేలం పాట తేదీని ప్రకటిస్తామన్నారు.

ఇంటర్ ఫెయిల్ విద్యార్థులకు 30 వరకు ఫీజు చెల్లింపు గడువు

గూడూరు: ఇంటర్‌లో ఫెయిల్ విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఫీజు చెల్లింపునకు ఈ నెల 30 వరకు గడవు ఇచ్చినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2023లో కళాశాలలో చదివి ఫెయిల్ అయిన విద్యార్థులు ప్రభుత్వం ఈ అవకాశం ఇచ్చిందని, స్వద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

షాదీఖానా మంజూరు చేయాలని వినతి

గూడూరు: ముస్లింలకు షాదీఖానా, పొన్నకల్లు మదర్సాకు ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బుధవారం అమరావతిలో చీఫ్ సెక్రటరీ, అడిషనల్ సీసీఎల్‌ఆర్ ఇంతియాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశామని మున్సిపల్ వైస్ చైర్మన్ పీఎస్ అస్లామ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైస్ చైర్మన్ బోయ లక్ష్మన్న, మునుగాల సర్పంచ్ రామాంజనేయులు, కౌన్సిలర్లతో కలిసి గూడూరు పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను విన్నవించగా ఇంతియాజ్ సానుకూలంగా స్పందించారన్నారు.

ప్రతి ఇంటికీ వైద్య సేవలు



గడివేముల-2 పరిధిలో వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గడివేముల: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి వద్దకు వైద్య సేవలు అందిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారిణి మొల్లా జబీన్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పెసరవాయిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ప్రతి ఇంటి వద్దకు వైద్య సిబ్బంది వెళ్లి ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరిని పరీక్షించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నారు. అదేవిధంగా ఈ నెల 30వ తేదీన నిర్వహించే వైద్య శిబిరంలో అందజేసే వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

రైతులు పంట నమోదు చేయించుకోవాలి



లద్దగిరి రైతు భరోసా కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన ప్రతి పైరును పంట నమోదు చేయించుకోవాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. బుధవారం మండలంలోని అనుగొండ, లద్దగిరి, పులకుర్తి గ్రామాల్లో ఏఓ రవిప్రకాష్ పర్యటించారు. రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేయడంతో పాటు ఆయా గ్రామాల రైతులతో సమావేశమయ్యారు. పంట నమోదు, రబీ కింద సాగు చేసే పంటల వివరాలపై చర్చించారు. ఖరీఫ్ కింద సాగు చేసిన పంటల నమోదు కార్యక్రమం చివరి దశకు చేరుకుందని, ఎవ్వరైనా రైతులు మిగిలిపోయి ఉంటే ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి త్వరగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

శనగ విత్తనాలకు పేర్లు నమోదు చేయించుకోవాలి

రబీ సీజన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై శనగ విత్తనాలను అందజేస్తోందని, అవసరమైన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి పేర్లను యాప్‌లో నమోదు చేయించుకోవాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. మండలానికి 3,000 క్వింటాళ్ల శనగ విత్తనాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, సబ్సిడీ పోను రైతులు క్వింటానికి రూ.4,860 చెల్లించాల్సి ఉంటుందన్నారు. గత ఏడాది ఎకరాకు 25కిలోల ప్రకారం ఇవ్వగా, ఈ ఏడాది ఎకరాకు 40కిలోల చొప్పున శనగ విత్తనాలను ప్రభుత్వం అందజేస్తోందని ఏఓ రైతులకు వివరించారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రమణమూర్తి

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి అన్నారు. బుధవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, పీహెచ్‌సీల వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఏఎన్ఎమ్‌లు, వలంటీర్లు ఇంటింటి సర్వేను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. వైద్య శిబిరంలో ఇద్దరు పీహెచ్‌సీ డాక్టర్లు, ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు ఉంటారని, ప్రజలకు ఈ అవకాశని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవికిషోర్, ఉలిందకొండ, కల్లూరు పీహెచ్‌సీ కేంద్రాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ప్రజల ఆరోగ్య భద్రత నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఎంపీడీఓ శివనాగప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 28వ తేదీవరకు నిర్వహించే ఆరోగ్య శిబిరాల వివరాలను ఆయన వెల్లడించారు. ఈ నెల 30వ తేదీన హుసునాపురం గ్రామంలో జరగాల్సివున్న ఆరోగ్య శిబిరాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద 26వ తేదీ నిర్వహించడం జరిగిందన్నారు. మిగతా గ్రామాలలో జరిగే మెగా వైద్య శిబిరాలలో వైద్యులు ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు వెల్లడించారు. ఇందులో భాగంగా అక్టోబర్ 3వ తేదీన కాల్వ-1, 4వ తేదీన నన్నూరు-1,2 సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 5న నన్నూరు-3 సచివాలయం, 6వ తేదీన శకునాల, 7వ తేదీ మీదివేముల, 10వ తేదీన సోమయాజులపల్లె, 11న లొద్దిపల్లె, 12న కన్నమడకల, 13-ఉప్పలపాడు, 17-పూడిచెర్ల, 18-ఉయ్యాలవాడ, 19-కొమరోలు, 21-కాల్వ-2 సచివాలయం, 26-ఎస్ కొంతలపాడు, 27-ఓర్వకల్లు, 28వ తేదీన బ్రాహ్మణపల్లె గ్రామాలలో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అన్ని సౌకర్యాలు కల్పించాలి



ఆలమూరులో శిబిరం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ జనార్ధన్‌రావు

పాణ్యం: ఈనెల 30వ తేదీన ఆలమూరు గ్రామంలో ప్రారంభమయ్యే ''జగననన్న ఆరోగ్య సురక్ష'' వైద్య శిబిరం కార్యక్రమానికి సంబధించి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని డీఎల్‌డీఓ జనార్ధన్‌రావు అన్నారు. బుధవారం ఆలమూరు గ్రామంలో నిర్వహించే వైద్య శిబిరానికి సంబంధించి స్థలాన్ని, ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే వైద్య శిబిరంలో చికిత్సలు, పరీక్షలు, ప్రజలు వేచి ఉండు ప్రత్యేక స్థలం, ఓపీలు, టోకెన్లు, ప్రజలు అందిచాల్సిన సేవలపై ఆరా తీశారు. అలాగే డాక్టర్లు చికిత్సలు చేసే కౌంటర్లు తదితర వాటిపై ఆరా తీశారు. వైద్య శిబిరానికి వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ దస్తగిరి, డాక్టర్ సునీతా, ముల్ల మహ్మద్ షరీఫ్, మల్లు జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.